క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు



హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలుగు నూతన సంవత్సరాది శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని, ఉగాది పచ్చడిలాగే జీవితాలు షడ్రుచుల సంగమంగా మారాలని ఆకాంక్షించారు.

ఎండలో ఎక్కువసేపు ఉండొద్దు

వైద్యాధికారి నిఖిత



కూలీలతో మాట్లాడుతున్న వైద్యాధికారి నిఖిత

హుస్నాబాద్‌రూరల్: మండలం పోతారం (ఎస్) గ్రామంలో ఉపాధి హామీ పనుల దగ్గర కూలీలకు సోమవారం మీర్జాపూర్ వైద్యాధికారి డాక్టర్ నిఖిత వడదెబ్బ గురించి అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత పెరగడంతో కూలీలు ఉదయమే పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలని చెప్పారు. ఎండలో ఎక్కువసేపు పనులు చేయవద్దని, తాగునీరు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తల వద్ద గ్లూకోజ్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని అవసరమైన వారు తీసుకోవాలని చెప్పారు. ఆమె వెంట వైద్య సిబ్బంది రవీందర్‌రెడ్డి, సాంబయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రాన్ని ప్రారంభించిన ఎంపీ అభ్యర్థి



లఘు చిత్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): తనపై చిత్రీకరించిన లఘుచిత్రాన్ని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. సినీ హీరో అనిల్ మొగిలి ముఖ్యపాత్రలో నటించగా ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా అనిల్ మొగిలి మాట్లాడుతూ వెంకట్రామ్‌రెడ్డి కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయనను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా ఇమ్రాన్ అలీ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఇమ్రాన్ అలీని తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి పరానాజ్మి ఆదివారం హైద్రాబాద్‌లో నియమించినట్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడే అత్తు ఇమామ్ సోమవారం తెలిపారు.

అంగన్‌వాడీలో ప్రీ ప్రైమరీ వార్షికోత్సవం

కొముదవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల అంగన్‌వాడీ కేంద్రం- 2లో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారు నిర్వహించిన ఆటలు, పాటలు అందరినీ అలరించారు. ప్రీ స్కూలు నుంచి 1వ తరగతి వెళ్లే పిల్లకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పావని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, టీచర్ భవాని పాల్గొన్నారు.

11వ అంగన్‌వాడీ కేంద్రంలో..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగమణి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ వార్సికోత్సవ వేడుకలు నిర్వహించారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శోభ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన అడహక్ కమిటీ

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సోమవారం చేర్యాల ప్రాంత న్యాయవాదుల అడహక్ కమిటీ కన్వీనర్ ఆరెళ్ల వీరమల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ చేర్యాల కోర్టు ప్రారంభమయ్యేలా కృషి చేయాలని కొమ్మూరిని కోరినట్లు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలిసిన వారిలో కో-కన్వీనర్లు రవీందర్, రమేష్, న్యాయవాదులు శ్రీధర్, వెంకటేష్, సంతోష్ తదితరులున్నారు.

భానుడి భగభగ

- వడగాడ్పులతో జనం విలవిల
- నిర్మానుష్యంగా మారిన వీధులు



అక్కన్నపేటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

అక్కన్నపేట(హుస్నాబాద్): జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాధారణం కంటే ఎక్కువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే మొదటి వారంలో కాసే ఎండలు ఏప్రిల్ మొదటి వారంలో కాస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. నెల రోజుల ముందే భానుడు ప్రతాపానికి ప్రజలు భయపడుతున్నారు. ఇదే సమయంలో వడగాల్పులు, ఉక్కపోత పెరగడంతో జనం విలవిలలాడుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చెట్ల కింద సేద తీరుతున్నారు. ఆహార వ్యవహారాల్లో సైతం మార్పులు చేసుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉదయం 10దాటితే ప్రజలు రోడ్ల మీదకు వచ్చేందుకు జంకుతున్నారు. సాయంత్రం 4 దాటినా ఎండ వేడిమి తగ్గడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే మేలో భానుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.



చలివేంద్రంలో దాహం తీర్చుకుంటున్న ఓ వృద్ధురాలు

జాగ్రత్తలు తీసుకోవాలి..

ఎండ తీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. అత్యవసర పనులు ఉంటేనే జాగ్రత్తలు తీసుకొని బయటకు రావాలి. గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు బయటకు రావొద్దు. వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

– రమ్య, వైద్యాధికారి, అక్కన్నపేట మండలం

జాగ్రత్తలు తీసుకోవాలి

మండుతున్న ఎండలు, వడగాల్పులకు ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎండలో ఎక్కువ సమయం గడిపేవారు వడదెబ్బ బారినపడే అవకాశం ఉందంటున్నారు. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు నూలు దుస్తులు ధరించడం, బయటకి వెళితే గొడుగును ఉపయోగిస్తే మేలని చెబుతున్నారు. మజ్జిగ, ఓఆర్ఎస్, తీసుకుంటే వడదెబ్బ నుంచి తప్పించుకునే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

రైతులు, కూలీలకు ఇక్కట్లు

యాసంగి పనులతో పాటు ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. పలుచోట్ల వరి, మొక్కజొన్న కోతలు చివరి దశతో ఉన్నాయి. దీంతో ఎండల ప్రభావంతో కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల ఉదయమే పనులకు వెళ్లి మధ్యాహ్నమే ఇళ్లకు చేరుకుంటున్నారు.

'నవోదయ'కు 132 మంది హాజరు

వర్గల్(గజ్వేల్): ప్రేరణ ఉత్సవ్‌లో భాగంగా సోమవారం వర్గల్ నవోదయ విద్యాలయంలో ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 132 మంది విద్యార్థులు హాజరయ్యారని, అందులో 30 మందిని ఎంపిక చేశామని చెప్పారు.

కాలనీ భూమి స్వాహా!

- నిబంధనలు తుంగలోకి..
- 20 కుంటల భూమి రికార్డు నుంచి తొలగింపు



కొండెంగల కుంట, బీసీ కాలనీ స్థలం

చిన్నకోడూరు(సిద్దిపేట): బీసీ కాలనీ కోసం కేటాయించిన భూమిలో కొంత భాగాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. విలువైన భూమిని అక్రమంగా చేజిక్కించుకోవడంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోడూరు మండలం మైలారం మైలారం పంచాయతీ మధిర కొండెంగలకుంట గ్రామంలో సర్వేనంబర్ 573–ఇ లో 2.08 కుంటల భూమి బీసీ కాలనీ పేరున ఉండేది. కాలనీకి సమీపంలో వ్యవసాయ భూమి ఉన్న కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు ఆ భూమిపై కన్నేశాడు. 20 కుంటల భూమి రావాలంటూ మీ సేవలో 5 జనవరి 2023న దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన తహసీల్దార్ జనవరి 27న సిద్దిపేట ఆర్డీఓకు సరిచేయాలని ప్రపోజల్ పంపించారు. జనవరి 28న ఆర్డీఓ తహసీల్దార్ చేసిన ప్రపోజల్‌ను పరిశీలించి బీసీ కాలనీలో ఉండవల్సిన 20కుంటలు తొలగించాలని సీసీఎల్‌కు ప్రపోజల్ పంపించారు. దీంతో ఆ భూమి తొలగించబడింది. సుమారు రూ.20లక్షల విలువగల భూమిపై అవినీతికి పాల్పడ్డ అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జయలక్ష్మిని వివరణ కోరగా.. పై అధికారులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిడి వల్ల చేయవలసి వచ్చిందని, త్వరలోనే తిరిగి బీసీ కాలనీ పేరున రికార్డును సరి చేస్తానని తెలిపారు.

భువనగిరి ఎంపీగా గెలిపించండి

సీపీఎం అభ్యర్థి జహంగీర్



మాట్లాడుతున్న జహంగీర్

చేర్యాల(సిద్దిపేట): మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి సీపీఎం బలపర్చిన తనని భువనగిరి ఎంపీగా గెలిపించాలని సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. సోమవారం పట్టణ, రూరల్‌తో పాటు కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి పెరిగిపోయిందన్నారు. ప్రజలను విడదీస్తూ లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న రాజకీయ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గడిచిన పదేండ్లు రాష్ట్రంలో నియంతృత్వంగా వ్యవహరించిన కారణంగానే ప్రజలు విస్మరించారన్నారు. సమావేశంలో జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, గోపాలస్వామి, సత్తిరెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుంట పూడ్చివేతకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



మురుగు కుంటను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు కుంట పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. సోమవారం తిగుల్ గ్రామంలో సాక్షిలో 'ఇళ్ల మధ్య కుంట.. ప్రజలకు తంటా' అనే కథనానికి ఆయన స్పందించారు. ఉదయం ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, గ్రామ కార్యదర్శితో కలిసి గ్రామంలో కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకపోతామని తెలిపారు. ప్రజలు చెత్త వేయవద్దని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ బాధ్యతతో పని చేసినప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి వినిపించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లలో రాజీ పడొద్దు

మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: రంజాన్ పర్వదిన ఏర్పాట్లలో రాజీ పడొద్దని, పక్కాగా పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ అధికారులు, ముస్లిం పెద్దలతో కలిసి ఇక్బాల్ మినార్ ఈద్గా, ముస్లిం గ్రేవ్ యార్డులను పరిశీలించారు. సానిటరీ విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. పండుగ సందర్భంగా ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఈ రంజిత్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం రికార్డులను పరిశీలించి, ఓపీ, ఐపీ స్థాయిని పెంచాలని సిబ్బందికి సూచించారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వడదెబ్బ పడిన వారిని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట వినోద్, శ్రీనివాస్, డేనియల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు ఉగాది సంబురాలు



హుస్నాబాద్: పాఠశాలలో ఉగాది వేడుకలు



చౌడారంలో పచ్చడి తయారు చేస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు ఉగాది సంబురాలు ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం విద్యార్థులు ఆనందంగా జరుపుకున్నారు. స్థానిక నవ భారత్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత పాల్గొన్నారు. ఉగాది పచ్చడిని తయారు చేసి అందరికీ పంచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి, డైరెక్టర్లు వేల్పుల శ్రీనివాస్, గంగరవేణి రాజు, ప్రిన్సిపాల్ వినీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌదారంలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌదారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగి కార్యక్రమంలో కొత్త ఏడాది అంతా శుభాలు కలుగాలని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందాపూర్ పాఠశాలలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఉగాది పచ్చడి తయారుచేసి అందరికీ పంచారు. బాలకవి సమ్మేళనం, కవితా పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్



కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడకు చెందిన అనంతుల నరేందర్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చేతుల మీదుగా సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తున్న తీరులను విరివిగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకంతో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. దీంతో తన బాధ్యతలు మరింత పెరిగాయన్నారు.

◆ ఆయిల్‌ఫామ్ పంటల పరిశీలన

మర్కూక్(గజ్వేల్): ఆయిల్‌ఫామ్ పంటలకు రైతులు సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ మండల అధికారి సౌమ్య అన్నారు. సోమవారం మండలంలోని అంగడికిష్టాపూర్‌లో ఆయిల్‌ఫామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలం కాబట్టి ప్రతిరోజు నాలుగు గంటల పాటు నీరు అందించాలన్నారు.

◆ బస్సును పునరుద్ధరణకు వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట నుంచి గురువన్నపేటకు బస్సును పునరుదధరించాలని అయినాపూర్, పోసాన్‌పల్లి, గురువన్నపేట గ్రామస్తులు సోమవారం సిద్దిపేట డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఐదు ట్రిప్పులు బస్సు తిరిగేదని, కరోనాలో బస్సు సర్వీసులు నిలిపివేసినప్పటి వరకు బస్సును నడుపలేదని వారు వాపోయారు.

ఉద్యోగులతో బీఆర్ఎస్ సమావేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి ఇతర ఆపార్టీ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను ఎన్నికల్లో తమకే ఓటు వేసేలా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని, ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారన్నారు.

సీఈఓకు ఫిర్యాదు చేస్తాం: రఘునందన్‌రావు

బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి నిర్వహించిన సమావేశంలో సెర్ప్ సిబ్బంది పాల్గొనడంపై బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ తీవ్రంగా విమర్శించారు. ఆ మేరకు వివరాలతో సీఈఓకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అలాగే సీసీ పుటేజీలను పరిశీలించి, బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కాంగ్రెస్ నేతలు కోరారు.